మూతపడిన 'మన కూరగాయలు'

- నిర్వహణ లోపంతో మూతపడిన మార్కెట్లు
- తిరిగి ప్రారంభించాలని కోరుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ఎర్రగడ్డ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హంగు, ఆర్భాటాలతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'మన కూరగాయలు' మార్కెట్లు నిర్వహణ లోపంతో మూతపడ్డాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ మార్కెట్లను ఏర్పాటు చేయగా, ఇందులో భాగంగా ఎర్రగడ్డలో రెండు మార్కెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్ పరిధిలోని కల్యాణ్‌నగర్ వెంచర్ 3లో ఒకటి, జనప్రియ అపార్టుమెంట్స్ వద్ద మరొకటి ఏర్పాటు చేశారు. బహిరంగ మార్కెట్లో కన్నా తక్కువ ధరలకు తాజా కూరగాయలు వస్తుండటంతో వినియోగదారులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపేవారు. మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో ఉండే ఈ మార్కెట్లను ప్రవేటు సంస్థలకు అప్పజెప్పినప్పటికీ బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి ప్రభుత్వమే కూరగాయలను కొనుగోలు చేసి సరఫరా చేసేది. రోజు వారీ కూరగాయల ధరలను ప్రభుత్వమే నిర్ధారించేది. నిర్వాహకులు కమీషన్ పద్ధతిన కూరగాయలను విక్రయించేవారు. కల్యాణ్‌నగర్ వెంచర్-3లోని మన కూరగాయల మార్కెట్‌ను జనేర అనే సంస్థకు అప్పగించగా.. జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద గల మార్కెట్‌ను ఫార్మ్ పిక్స్ అనే సంస్థకు అప్పగించారు. ఈ మార్కెట్లలో కూరగాయలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఖచ్చితమైన బిల్లులను అందజేసేవారు. అయితే ప్రస్తుతం ఇవి మూతపడడంతో సూపర్ మార్కెట్లకు వెళ్లి అధిక ధరలను వెచ్చించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ మార్కెట్లను తిరిగి ప్రారంభిస్తే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు.


మార్కెట్ ప్రస్తుత దుస్థితి


కల్యాణ్‌నగర్ వెంచర్ 3లో గతంలో ఉన్న 'మన కూరగాయలు' మార్కెట్

అధికారులు స్పందించడం లేదు



మన కూరగాయల మార్కెట్‌ట్లు మూతపడడంతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుంది. టెండర్లు నిర్వహించి తామే కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసుకుంటామని సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసినా ఎలాంటి స్పందన లేదు. అధికారులు సత్వరమే స్పందించి మార్కెట్ స్థలాన్ని తమకు అప్పగించాలి లేదా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపయోగించాలి.

- నరసింహారావు, కల్యాణ్‌నగర్ వెంచర్ 3 అధ్యక్షుడు

మార్కెట్లను తిరిగి ప్రారంభించాలి



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మన కూరగాయల మార్కెట్లను మళ్లీ ప్రారంభించాలి. అవి ఉన్నప్పుడు తక్కువ ధరలకే తాజా కూరగాయలు లభించేవి. ఇప్పుడు కూరగాయల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం చొరవ చూపి మూతపడ్డ మార్కెట్లను తిరిగి ప్రారంభిస్తే బాగుంటుంది.

- బి.శివకుమార్. ఎర్రగడ్డ ఓల్డ్ సుల్తాన్‌నగర్


శిక్షణ పూర్తి చేసుకున్న వారితో కమ్మ సంఘం ప్రతినిధులు

కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత

అమీర్‌పేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ద్వారా కంప్యూటర్ బేసిక్స్‌లో శిక్షణ తీసుకున్న వృద్ధులు, మహిళలు, విద్యార్థులకు సంస్థ ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్మ సంఘం ఆధ్వర్యంలో కులాలకు అతీతంగా ఉచితంగా కంప్యూటర్ బేసిక్స్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. తదుపరి బ్యాచ్ అభ్యర్థుల ఎంపికకు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లె తెలిపారు. 20న క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9849566945, 9177661161 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

21, 22 తేదీల్లో సీనియర్ సిటిజెన్లకు ఆటల పోటీలు

అమీర్‌పేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ఆసరా సర్కిల్-17 కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్లకు ఈ నెల 21, 22 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షులు జేఎస్‌టీ సాయి వెల్లడించారు. మోడల్ కాలనీలోని సీనియర్ సిటిజెన్స్ కౌన్సిల్ కార్యాలయంలో ఇండోర్ క్రీడలు, సుందర్‌నగర్‌లోని సుందరభారతి కమ్యూనిటీహాల్ ఆవరణలో అవుట్ డోర్ క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి ఉన్నవారు 8977914856 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఖైరతాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎల్పీ నేత, దివంగత పి.జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి తెలిపారు. ఐమాక్స్ పక్కనున్న హెచ్‌ఎండీఏ ఖాళీ స్థలంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, పలు విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రక్తదాన శిబిరం సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

యాదవ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ల పంపిణీ

ఖైరతాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం క్యాలెండర్లను, నువ్వుల లడ్డూలను పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక మహాకాళి దేవాలయంలో 2025 యాదవ సంఘం క్యాలెండర్‌ను సంఘం అధ్యక్షుడు బాలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి మారయ్య యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం బృందాలుగా విడిపోయి వాటిని పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు శ్రీశైలం యాదవ్, బవాని కృష్ణ యాదవ్, జ్ఞానేశ్వర్ యాదవ్, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


గాయత్రికి బ్యాగును అందజేస్తున్న పోలీసులు

నిజాయితీ చాటుకున్న బైక్ మెకానిక్

బోరబండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆలయం వద్ద భక్తులు మర్చిపోయిన బ్యాగ్‌ను తిరిగిచ్చి ఓ వ్యక్తి నిజాయితీ చాటుకున్నాడు. మోతీనగర్‌కు చెందిన కె.గాయత్రి, ఆమె భర్త నటరాజ్ నగర్‌లోని రాయాలయానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. గుడి వద్దకు వెళ్లాక వెంట తెచ్చుకున్న బ్యాగ్‌ను బైక్‌పై పెట్టి మర్చిపోయి వెళ్లారు. అందులో విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ ఉంది. అయితే గుడి సమీపంలో సుల్తాన్ నగర్‌కు చెందిన సి.గురుమూర్తి బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బ్యాగ్ కనిపించడంతో ఓపెన్ చేసి చూడగా నగలు, సెల్‌ఫోన్ కనిపించడంతో బోరబండ పోలీసులకు అందజేశాడు. సీఐ వీరశేఖర్, డీఐ భూపాల్ గౌడ్, ఎస్ఐ నాగుల్ మీరా ఆ బ్యాగును .గాయత్రికి అందజేసి గురుమూర్తిని అభినందించి సత్కరించారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి అదృశ్యం


సుభానుద్దీన్(ఫైల్)

బోరబండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నాగుల్‌మీరా వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌ఆర్ పురం సైట్-3కి చెందిన షేక్ సుభానుద్దీన్ (33) తన భార్య నూర్జహన్‌తో ఈ నెల 9న గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో నూర్జహన్ శనివారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిబ్రవరి 2న లక్ష మందితో ర్యాలీ

- మాల సంఘాల జేఏసీ

పంజాగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 2న నగరంలో లక్ష మంది-లక్ష కర్రలతో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. నెక్లెస్ రోడ్డు నుంచి భారీ అంబేడ్కర్ విగ్రహం వరకు చేపట్టనున్న ర్యాలీలో మాల, అనుబంధ కులాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు జి.చెన్నయ్య, మందాల భాస్కర్, చెరుకు రాంచందర్, గోపరాజు రమేష్ కోరారు. జేఏసీ నాయకులతో కలిసి వారు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలన ప్రారంభమైన నాటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. అన్నదమ్ముల్లా కలిసి ఉండాల్సిన దళితుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 2న నిర్వహించే శాంతియుత ర్యాలీ ఒక చేతిలో రాజ్యాంగం, మరో చేతిలో కర్ర(బరిసె) పట్టుకుని మాల కులస్థులతో పాటు అనుబంధ కులాల వారు భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.


వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తదితరులు


ఎస్పీఆర్ హిల్స్‌లో ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

బంజారాహిల్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో వడ్డె ఓబన్న చేసిన పోరాటం చిరస్మరణీయమని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్ గౌతంనగర్ కమ్యూనిటీహాల్ వద్ద వడ్డె ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెల్దండ వెంకటేష్ ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓబన్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు యాదయ్య, కుమార్, తిరుపతి, బసవరాజు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో..

యూసుఫ్‌గూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్‌లో ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నగర నాయకుడు భవానీశంకర్, ఎంబీసీ చైర్మన్ జె.జైపాల్, వడ్డెర జాతీయ నాయకుడు వేముల వెంకటేష్, తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక అధ్యక్షుడు వేముల యాదయ్య తదితరులు నివాళులర్పించారు. అనంతరం వడ్డెర సంఘం నాయకులు, సభ్యులు ర్యాలీగా వెళ్లి రవీంద్రభారతిలో నిర్వహించిన ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ బాబా, సీఐ వీరశేఖర్ తదితరులు


సదస్సుకు హాజరైన మహిళలు, యువత

మత్తుకు బానిసై ఆగం కావొద్దు

- యువతకు కార్పొరేటర్ ఫసియుద్దీన్ సూచన

బోరబండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసై బతుకును ఆగం చేసుకొవద్దని, డ్రగ్స్‌కు అలవాటుపడితే బతుకు ఛిద్రం అవుతుందని కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ అన్నారు. బోరబండ భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ బాబా మాట్లాడుతూ.. గంజాయి, కొకైన్, ఎరైన్ వంటి మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల ఊపిరితిత్తులు చెడిపోతాయన్నారు. మార్పు యువత చేతుల్లోనే ఉందని, అందుకే వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం సీఐ వీరశేఖర్, డీఐ భూపాల్ గౌడ్, యూసీడీ అధికారి వెంకటకిషన్‌తో కలిసి డ్రగ్స్ నివారణ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలపై కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.అశోక్, కాసుల మహేష్‌గౌడ్, ఖయ్యూమ్, దేవేందర్, బాలరాజ్‌తో పాటు పూజారి, పాస్టర్, ఇమామ్ పాల్గొని సదస్సుకు హాజరైన వాళ్లతో మత్తు పదార్థాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.

భారీగా నాటుసారా ముడిసరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, పటికను హైదరాబాద్ ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి 1000 కేజీల బెల్లం, 50 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఒక కారులో బీదర్ నుంచి నగరం మీదుగా భారీగా బెల్లం, పట్టిక రవాణా అవుతున్నట్లు హైదరాబాద్ ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ భిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు, కానిస్టేబుల్స్ యాదగిరి, కౌశిక్, శంకర్ కారును వెంబడించి నల్గొండ జిల్లా దేవరకొండ పరిధిలోని చెరుకుపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేసిన పోలీసులకు భారీస్థాయిలో సరుకు దొరికింది. దీన్ని సీజ్ చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ పడమటి తండాకు చెందిన రమేష్ బీదర్ నుంచి సరుకును తెస్తున్నట్లు తేలింది.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం, పట్టిక బస్తాలు, కారుతో పాటు నిందితుడు


శీల చైతన్యకు బహుమతి అందజేస్తున్న అతిథులు

ముగ్గుల పోటీలు

ఖైరతాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఖైరతాబాద్ బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ముగ్గులు వేయగా, విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ శీల చైతన్యయాదవ్ మొదటి బహుమతిని గెలుచుకోగా, రెండవ బహుమతిని ఎ.లక్ష్మి, మూడవ బహుమతిని ఎనవనీత గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి జి.గోపాల్, ఉపాధ్యక్షుడు ఎస్ అశోక్‌యాదవ్, కోశాధికారి శివరామేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివప్రసాద్‌శర్మకు గౌరవ డాక్టరేట్

పంజాగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇరవైళ్లుగా ఎంతోమందికి జ్యోతిష్యంతో సలహాలు ఇచ్చి వారి జీవితాలను సక్రమమైన మార్గంలో నడిచేలా చేస్తున్న తనకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ఇవ్వడం ఆనందంగా ఉందని ప్రముఖ జ్యోతిష్యులు బ్రహ్మశ్రీ ఎం.శివప్రసాద్‌శర్మ అన్నారు. శనివారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గత 5 సంవత్సరాలుగా మనం మాట్లాడితే వచ్చే శబ్దాన్ని గణితం చేసి జాతకం చెప్పడంలో ప్రావీణ్యం సంపాదించిన తనను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు గుర్తించారన్నారు.


కొత్త యంత్రాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రమణకుమార్

ప్రభుత్వ ముద్రణాలయానికి నూతన యంత్రాలు

ఖైరతాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయంలోకి కొన్ని కొత్త యంత్రాలు వచ్చాయి. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నరసింహారెడ్డి సహకారంతో సమకూరిన రెండు ఆటోమేటిక్ నంబరింగ్ యంత్రాలు, రెండు బుక్ పాకింగ్ యంత్రాలు, హై ప్రింటింగ్ ఫస్ట్ 300 మెషీన్లకు పిన్నింగ్ యంత్రాలు, హెవీ డ్యూటీ పిన్నింగ్ యంత్రాలను సంస్థ డైరెక్టర్ సి.రమణ కుమార్ శనివారం ప్రారంభించారు. సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు సహకారం అందజేస్తానని డైరెక్టర్ హామీ ఇచ్చారు. తాము కష్టపడి పని చేసేందుకు సిద్ధంగా వున్నామని, ముద్రణాలయంలో మరిన్ని ఆధునిక ప్రింటింగ్ యంత్రాలు కావాలని జేఏసీ ప్రతినిధులు కోరారు.

సంక్రాంతి సంబురం


సంక్రాంతిని పురస్కరించుకుని గాయత్రిహిల్స్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు తదితరులు హాజరయ్యారు.

- బంజారాహిల్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..

పోలీసులకు సమాచారం ఇవ్వండి

● తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్


సీఐ శంకర్ నాయక్

అడ్డగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఊరెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. సంక్రాంతి పండుగకు స్కూల్ పిల్లలకు సెలవులు ఉండడంతో చాలమంది ఊరెళ్తారని, ఇదే అదునుగా దొంగలు మధ్యాహ్నం వేళ రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతుంటారని తెలిపారు. తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్తీల్లో రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. బుధవారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ పడుగకు ఊరెళ్లే వారికి పలు సూచనలు చేశారు...

ఈ జాగ్రత్తలు పాటించండి

- ఊరెళ్లేవారు ఇంటి పక్కన ఉండేవారికి సమాచారం ఇవ్వాలి.
- బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్‌లో దాచుకోవాలి.
- విలువైన వస్తువులు ఇంట్లో, స్కూటర్ డిక్కీలో, కారులో పెట్టకూడదు.
- ఇంటి డోర్‌కు లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి.
- బీరువా లాకర్ తాళాలు వెంట తీసుకెళ్లాలి.
- ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- ఇంటికి తాళం వేసి, కనిపించకుండా డోర్ కర్టన్ వేయాలి.
- పేపర్, పాలవారిని రావొద్దని చెప్పాలి.
- పనిమనుషులు ఉంటే రోజూ వాకిలిని ఊడ్చమని చెప్పాలి.
- బైకులు ఇంటి ముందే పార్కు చేసుకోవాలి.
- ఇంటికి సీసీకెమోరాలు బిగించుకుని, ఫోన్‌తో అనుసంధానం చేసుకోవాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లే వారు తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ ఫోన్ నం. 8712661250కు వాట్సాప్ నం.9490616555కు సమాచారం ఇవ్వాలి.

సంక్రాంతికి పతంగుల జోరు

● దుకాణాల వద్ద కోలాహలం
● ఆకట్టుకుంటున్న రంగుల పతంగులు

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంక్రాంతి పండగ వచ్చిందంటే ఆకాశంలో పతంగులు ఎగరాల్సిందే.. పండుగ వారం రోజుల ముందునుంచే పిల్లలు పతంగులు ఎగరేస్తుంటారు. మ్యూజిక్‌లతో డాన్స్ చేస్తూ పతంగులు ఎగుర వేస్తుంటే ఆ మజానే వేరే ఉంటుంది. ఏ ప్రాంతంలో చూసిన ఆకాశంలో పతంగులు ఎగురుతూ ఉంటాయి. అందరికంటే తమ పతంగే ముందుండాలని ఆకాశంలోకి పోటీగా పతంగులు ఎగురవేస్తూ ఉంటారు. సంక్రాంతి పండుగ అంటే గొబ్బిళ్లు, రంగు, రంగుల ముగ్గులు, హరిదాసు, గంగిరెద్దు విన్యాసాలు గుర్తుకువస్తాయి. ఆయా సీజన్‌ల బట్టి పతంగులు మార్కెట్‌లోకి వస్తుంటాయి. వీటితో పాటు డ్రాగన్, ఎరోప్లేన్, స్పైడర్‌మెన్, బోగిమెన్, బ్యాట్‌మెన్, ఫిష్, ఈగల్, టైగర్ తదితర ఆకృతులతో కైట్స్ దర్శనం ఇస్తున్నాయి. పతంగులను ఎగురవేసేందుకు ఉపయోగించే వివిధ రకాల మాంజాలను దుకాణాలలో విక్రయిస్తున్నారు. ఐదు రూపాయల నుంచి ఐదు వందల వరకు పతంగిని దుకాణాలలో అమ్ముతున్నారు.

వారాసిగూడ పతంగులకు పెట్టింది పేరు..

నగరంలో పతంగులు కొనాలంటే ముందుగా గుర్తు వచ్చేది.. వారాసిగూడ చౌరస్తా... సుమారు యాభై సంవత్సరాల నుండి సి.ధర్మయ్య పతంగి హౌజ్, సారంగ్ పతంగ్ సెంటర్ దుకాణాలు పతంగులను విక్రయిస్తుంటారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి పతంగులు కొనుగోలు చేసి వెళ్లతుంటారు.


వారాసిగూడలో పతంగుల దుకాణం వద్ద రద్దీ



ఆకట్టుకుంటున్న చిన్నారుల పతంగులు

పతంగులు దుకాణాలతో వారాసిగూడ చౌరస్తా సందడిగా మారింది. కాన్పూర్, ముంబాయి, దూళిపేట తదితర ప్రాంతాల నుంచి భారీ మొత్తంలో పతంగులను కొనుగోలు చేసి ఇక్కడ ఏర్పాటు చేసిన దుకాణాల్లో విక్రయిస్తుంటారు. యువకులతో పాటు చిన్నపిల్లలు, పెద్దలు పతంగులను కొనుగోలు చేస్తున్నారు.

పతంగులు ఎగురవేసేటప్పుడు పిల్లలు తగుజాగ్రత్తలు తీసుకుంటే మంచిందని పోలీసులు తెలుపుతున్నారు. ప్రమాదకరంగా ఉండే గోడలు, అపార్ట్‌మెంట్లపై, ట్యాంకులపై పతంగులు ఎగుర వేయవద్దని సూచిస్తున్నారు.. కరెంట్ స్తంభాలు, చెట్లు, విద్యుత్ తీగలకు వేలాడుతున్న పతంగల జోలికి పోకుంటే మంచింది. పతంగులు ఎగురవేసేటప్పుడు తదితర జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. చైనా మంజాలను ప్రభుత్వం నియంత్రించటంతో దుకాణాల్లో ఈ మంజాలను అమ్మటంలేదు.


ఒకవేళ చైనా మంజాలను అమ్మిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రస్తుతం అంతంతమాత్రమే



ప్రస్తుత్తం పతంగుల అమ్మకాలు అంతంత మాత్రమే సాగుతున్నాయి. మరో రెండు రోజుల్లో అమ్మకాలు పెరిగే అవకాశాలున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం నిషేధించిన చైనా మంజాలను అమ్మటం లేదు... సాధారణ సాదీ(దారం)ను యువత కొనుగోలు చేయాటానికా ఆసక్తి చూపటం లేదు. చాలా మంది చైనా మంజాలను అడుగుతున్నారు. దీంతో పతంగులు కొనుగోలు దారుల సంఖ్య తగ్గింది.

-రాచకట్ల సారంగపాణి

ఆనవాయితీగా వస్తోంది



పూర్వం నుంచి పతంగులు అమ్మటం ఆనవాయితీగా వస్తుంది. కరోనా తర్వాత పతంగులు వ్యాపారం అంతగా లేదు. కొనుగోలుదారులు తగ్గుతున్నారు. దీంతో పాటు పతంగులు, మాంజాలు, చెఱకు, దారాలు రేట్లు విపరీతంగా పెరిగాయి. ఇటీవల దుకాణాలు ఎక్కువ కావటం, అమ్మకాల్లో పోటీ ఉండటంతో అంతంత మాత్రమే వ్యాపారం సాగుతుంది. దూల్‌పేట్ తర్వాత నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వారాసిగూడకు వచ్చి పతంగుల కోనుగోలు చేసి తీసుకువెళ్లారు.

-ధర్మయ్య, పతంగి షాపు యజమాని


ముగ్గులను తిలకిస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, తదితరులు

బీదలబస్తీ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ ప్లే గ్రౌండ్‌లో శనివారం ఉదయం బీజేపీ మహిళా నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. సుమారు వందమంది మహిళలు పోటీల్లో పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముగ్గులను తిలకించారు. మూడు ముగ్గులను ఎంపిక చేసి వారికి బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, నాయకులు హన్మంతు ముదిరాజ్, భాస్కరగిరి, డివిజన్ అధ్యక్షుడు నరేష్, నాయకురాళ్లు అనిత, అనూష, నాగమల్లేశ్వరి, కళావతి, నాగరాణి, సతీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో బీజేపీ నూతన అధ్యక్షుల పేర్లను ప్రకటిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్ ప్రజల సేవలో బీజేపీ

● బోర్డు నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ

మారేడుపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం ఉన్న పార్టీ అని పనిచేసే ప్రతి వ్యక్తికి గుర్తింపును ఇస్తుందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ అన్నారు. శనివారం మహేంద్ర హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు 8 వార్డుల బీజేపీ అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. అదేవిధంగా మోండా డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడి పేర్లను వెల్లడించారు. వార్డు-1 జైపాల్‌రెడ్డి, వార్డు-2 మండుల శ్రావణ్, వార్డు-3 ఐతా అరుణ్, వార్డు-4 సచిన్ ఖంకే, వార్డు-5 బల్దా సంతోష్ కుమార్, వార్డు-6 ప్రతీక్ లోధా, వార్డు-7 బీపీ పవన్ కుమార్, వార్డు-8 పింజర ప్రవీణ్, మోండా అధ్యక్షులుగా బన్సీలాల్ జితేంద్ర కుమార్ పేర్లను ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్షులుగా ప్రకటించిన నేపథ్యంలో అధ్యక్షులందరికి శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షులు, పూర్వ అధ్యక్షులు, సీనియర్ నాయకులు విజయానంద్, శ్రీను, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

అడ్డగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గెరిళ్ల యుద్ధాన్ని నడిపిన వీర యోధుడు వడ్డె ఓబన్న ఆశయ సాధనాల కోసం పనిచేస్తామని వడ్డెర సంఘం ప్రతినిధి గోగుల స్వామి అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబెన్న జయంతి కార్యక్రమం సందర్భంగా ఆయన శనివారం తుకారాంగేట్ రియోపాయింట్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు గెరిళ్ల యుద్ధాన్ని నడిపిన వీర యోధుడన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వరికొప్పుల శ్యామ్, గణేష్, ఎల్లయ్య, సంతోష్ కుమార్, రాజేష్, స్వామి, శ్రీను, శివకుమార్, వెంకటేష్, యాదగిరి, రమేష్, నర్సింహ, టెంట్‌హౌజ్ స్వామి, బీజేపీ నాయకులు ఉదయ్ యాదవ్, శ్యాం సుందర్, తదితరులు పాల్గొన్నారు.


బొల్లారం రిసాల బజార్‌లోని హజరత్ సయ్యద్ అహ్మద్ షా క్వాద్రి దర్గా సమీపంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదేశాల మేరకు 120 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభం అయ్యాయి.

-తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


వ్యాపారుల విన్నపాలు వింటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని పాలికా బజార్, మోండా మార్కెట్, 31 బస్టాప్, ఓల్డ్ జైల్ ఖానా ప్రాంతాలలోని ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శనివారం వెస్ట్ మారేడు పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఎన్నో సంవత్సరాల నుంచి ఇదే వృత్తిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు, అధికారులతో కలిసి పర్యటించి సమస్య పరిష్కారానికి సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి అశోక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగులు, శ్రీనాథ్, అమర్, హాకర్స్ గోవర్ధన్, శివ, బబ్లు, అర్షాఫ్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గుర్తింపుపొందిన స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మారేడుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు.


మూలవిరాట్ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ

ముగిసిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండురోజులు పాటు జరిగిన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమలు ముఖ్య అతిథులుగా పాల్గొని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో వారు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు వారిని ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో నాయకులు కరాటేరాజు, కమిటీ సభ్యులు రాజేష్‌సింగ్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, సాదం బాలరాజ్‌యాదవ్, శ్రీనివాస్‌సాగర్, లక్ష్మణ్, సంజయ్, సంగీత్, వేణు, భగ్గు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కూడారై వేడుకలు



బోయినపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలో తిరుమలగా విరాజిల్లుతున్న బోయినపల్లి న్యూసిటీ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గడిచిన 29 రోజులుగా ధనుర్మాస వేడుకలు, తిరుప్పావై సేవ ప్రవచనాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం దేవాలయంలో కూడారై వేడుకలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

మూలవిరాట్ వేంకటేశ్వరస్వామి వారిని ప్రత్యేకంగా అలకరించారు. వేంకటేశ్వరస్వామి, గోదాదేవి అమ్మవార్లకు 108 ఇత్తడి, 54 వెండి గంగళాలతో పాయసం నివేదించి కాకుల్లా పండుగలా కూడారై ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు నారాయణ, లక్ష్మణ్, యాదయ్య, రామోహ్మన్‌రావు, జగన్నాథం, అర్చకులు పవన్‌స్వామి, దీపక్‌స్వామి, శ్రీధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

త్రిముఖ వ్యూహంతో ముందుకెళ్తాం

● కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ


రామకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

సికింద్రాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం, రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట ప్రభుత్వం మెడలు వచ్చి నిధులు తీసుకురావటం, కంటోన్మెంట్‌లో బీజేపీని మరింత బలోపేతం చేయడం... ఇలా త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగునున్నట్లు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ తెలిపారు. కంటోన్మెంట్ నామినేటెడ్ పదవిని కేంద్ర రక్షణశాఖ మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2026 ఫిబ్రవరి నెల వరకు తన పదవి కొనసాగునున్నట్లు రామకృష్ణ తెలిపారు. తనపై విశ్వాసంతో తనను మరో ఏడాది పాటు నామినేటెడ్ సభ్యుడిగా కొనసాగించాలని కేంద్ర నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మోదీ ప్రభుత్వం సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నదని, రాబోయే కాలంలో మరిన్ని నిధులు తీసుకురావటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ కంటోన్మెంట్‌పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, ఉద్యమాల ద్వారా, న్యాయపోరాటం ద్వారా నిధులు సాధిస్తామన్నారు. మరోవైపు కంటోన్మెంట్‌లో బీజేపీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో పిల్లలకు కలిగే ఎలాంటి ఇబ్బందులైనా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కరించడానికి కృషి చేస్తానని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. విక్టోరియా రాణిగంజ్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం అప్సా ఆధ్వర్యంలో వెంగళరావు నగర్, గైదీన్ బాగ్, విక్టోరియా గంజ్ బస్తీల పిల్లలతో చైల్డ్ ఫ్రెండ్లీ వార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ పిల్లలు బస్తీలలో ఎదుర్కొంటున్న సమస్యలు, పారిశుధ్య సమస్య, కుక్కల బెడద, నీటి సరఫరా, సీసీ కెమెరాలు, మాదక ద్రవ్యాలు, మత్తుపానియాలకు సంబందించిన ఎటువంటి సమస్యనైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మహంకాళి ఎస్సై పరదేశీ జాన్, వాటర్ వర్క్స్ మేనేజర్ మనోహర్, రాజు, జీహెచ్ఎంసీ శానిటేషన్ డిపార్ట్‌మెంట్ అధికారి ధనాగౌడ్, ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ నుంచి శ్రీనివాస్, విక్టోరియారాణీ గంజ్ బస్తీ అధ్యక్షులు ఎస్సార్ మల్లేష్, ఆయా బస్తీల వలంటీర్లు భాగ్య, అనిత, వసంత, ఉమాదేవి, శోభ, సరిత, అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, లావణ్య, బీజేపీ నాయకులు గోపికిషన్, నరేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

● విద్యార్థుల సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించిన ఇన్‌చార్జ్ వీసీ


హాస్టళ్లలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జి వీసీ

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ బాలకిష్టారెడ్డి శనివారం విద్యార్థుల హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి హాస్టళ్లను సందర్శించి ఆయన విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. అపై వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. విద్యార్థులంతా తమ బైక్‌లను పార్క్ చేసేందుకు గౌతమి హాస్టల్ సెల్లార్‌ను, వాహనాల పార్కింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్పందించిన అధికారులు, గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్‌కు మార్చుతూ ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే విద్యార్థులు తన దృష్టికి తేవాలన్నారు.

ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయి

● నిఘాపెట్టి పట్టుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు
● రూ. 5.25 లక్షల విలువైన 21 కేజీల సరుకు స్వాధీనం
● 14 మందిపై కేసు నమోదు ఆరుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి, గుట్టుచప్పుడు కాకుండా ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 14 మంది నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 21 కేజీల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 5.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన ఆకాశ్ సింగ్ ఇంట్లో గంజాయి నిల్వ ఉందని ఎక్సైజ్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శనివారం టీమ్ లీడర్ అంజిరెడ్డి పర్యవేక్షణలో ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్ ఫోర్స్) బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో ఆకాష్‌సింగ్ ఇంట్లో 21 కేజీల గంజాయి దొరికింది. అతడిని విచారించగా.. ఆకాష్‌సింగ్, దుర్గేష్‌సింగ్, ఆనంద్‌సింగ్, శంకర్ సింగ్రా, హల్ సింగ్, లలిత్ కుమార్ కలిసి ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని తెప్పించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి ని విచారించిన క్రమంలో ఒడిశాకు చెందిన సురేష్ యాదవ్, ఉదయ్ సురేష్ దాలి, సరోజిత్ మరిదా, రాహుల్ సర్కార్, లంకా కుమార్, లాంప్‌లు గంజాయిని విక్రయించినట్లు తేలింది. వీరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ధూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు మధుబాబు, గోపాల్, ఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.


గంజాయితో పట్టుబడిన నిందితులు


పాన్‌బజార్‌లో గల జైన్ మందిర్ వద్ద భద్రతను పెంచాలని మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ నేతృత్వంలో వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు భద్రీష్, శ్రేయేష్, అల్కేష్, కిరణ్, నితిన్, పరాగ్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షులు మనోజ్ ఉపాధ్యాయ్.

-రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364